

# సైనికుని ఉత్తరం

"జగిత్యాల పాతబస్టాండ్ దిగండి"

కండక్టర్ గావుకేకకి ఒక వృద్ధుడు ఉలిక్కిపడ్డాడు బస్సులో. చేతిసంచి తీసికొని మారోమారు కళ్ళద్దాలు సర్దుకొని తన మూడోకాలికోసం వెతికాడు సీటుకింద... ఎవరో దాన్ని అందించారు.

"తొందరగా రావయ్యా... ఈపాటికే అరగంట లేటయింది" అసహనంగా అరిచాడు కండక్టర్

ముసలాయన బస్సు దిగి ఒకసారి ఊరుని పరికించి చూసాడు. ఊరు లంబాడీ యువతిలా అలంకరించుకొన్నట్లు కన్పించింది. ఎంత మారిపోయింది? అనుకున్నాడు.

"బాబూ... ఈ బస్సెక్కడికి పోతుంది?" ఎవరో అడిగారు.

"గంగలో దూకి గోదాట్లో తేలుతుంది. అసలు ఎక్కడికెళ్ళాలో చెప్పు ముందు" కండక్టర్ ముక్కుమీద మూరెడు కోపం.

"ఆ... అదీ... పెద్దపల్లికి పోతుందా?"

"ఏం మనిషివయ్యా. ముందు బోర్డు చూళ్ళేదా ? ఎక్కెక్కు.... రైట్ రైట్...." ఫీంకరించి టికెట్ క్లిప్‌తో నొక్కుపడేట్టు కొట్టాడు. అలా కొట్టి కొట్టి బస్సు టాపుని మశూచి ముఖంలా మార్చేశాడా కండక్టర్.

ముసలాయన ముఖంలో దుమ్ము కొట్టి పోయింది ఆర్టీసి(రోడ్ ట్రబుల్ కార్పోరేషన్) బస్సు. ఎనభై ఏళ్ళుంటాయేమో ! కొంచెం వంగి పోయినా దృఢంగానే కనిపిస్తున్నాడు. నుదుటి మీద గీతలు జీవితానుభవాన్ని ప్రతిఫలిస్తున్నాయి. ముడుతలు పడిన శరీరం మీద పచ్చటి నరాలు ఉబికి కన్పిస్తున్నాయి . ఎర్రగా ఎత్తుగా వున్నాడు.

అతని పేరు భరద్వాజ...

రోడ్డు ప్రక్కనించి నడుస్తూ గమనిస్తున్నాడు. దుకాణాలు, సినిమా హాళ్ళు, మార్కెట్లు, బార్‌లు, హోటళ్లు, జనం.... వూరు చాలా ఎదిగి పోయింది.

కొన్నేళ్ళ తర్వాత స్వంతగడ్డ మీద కాలు పెటినందుకు ఆ వృద్ధ శరీరం ఆనందంతో కంపిస్తోంది.

"బాబూ... ఈ వూర్లో గురజాడ వీధి వుండాలి. ఎక్కడుందో చూపిస్తావా?" అనడిగాడు దారిన పోతున్న దానయ్యని. అతడు పదినిమిషాల సేపు తలగోక్కొని, "ఇప్పటికి ఇరవై ఏళ్ళనించి ఈ వూర్లో వుంటున్నాను. అలాంటి వాడ పేరు విన్లేదండి..." అనేసి వెళ్ళి పోయాడు.

భరద్వాజలో అనుమానం... ఇది తన వూరేనా? ఖచ్చితంగా ఇదే. కాకపోతే సిటీ వాసన కొడ్తోంది అనుకున్నాడు.

"అయ్యా... ఈ వూర్లో గురజాడ వీధి వుండాలి.. మీకు తెలుసా?" అన్నాడు మరో మధ్యవయస్కుని పిలిచి. అతడు కూడా మరో పదినిమిషాలు ఆలోచించి... "నిజమేనండి. కాని అది పదిహేనేళ్ల కిందట ఇప్పుడు దాన్ని ఇందిరానగర్ అంటున్నారు. ఎందుకంటే ఆ ఏరియాలో వుంటున్నది ఎక్కువ కాంగిరేసోళ్లే కదా.. అలా సీదా వెళ్లి కుడివైపుకు తిరగండి. అక్కడ పార్కు ఎడమ సందులోంచి పోతే ఇందిరా నగర్ వస్తుంది" అన్నాడు.

పాత జ్ఞాపకాలు తోడేస్తున్నాయి. అణువంత పోలిక కూడా దొరక్కుండా ఎంతలా మారిపోయింది వూరు?

గతం తాలుకూ లయలా... మూడోకాలు చప్పుడు చేస్తోంది.

ఒకప్పుడు భరద్వాజ... ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్‌తో భుజం భుజం కలిపి పోరాడిన పోరాడిన యోధుడు. నలభై ఎనిమిది సంవత్సరాల తర్వాత.. తిరిగి తన వూరికి! ముసలాయన కళ్ళు చెమర్చాయి.

స్వాతంత్రం రాకముందు సైన్యంలోచేరి... తెల్లదొరల పాలనలోనే పదిహేడు

సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి.. స్వాతంత్ర్యం వచ్చిన మర్నాడు దేశం విడిపోవద్దనే పోరాటంలో ప్రధాన పాత్ర తనదైనందుకు... విడిపోయిన పాకిస్థాన్ చేతిలో బందీగా వెళ్లి అక్కడ ముప్పయి ఒక్క సంవత్సరాలు అక్కడి కటకటాల గోడల వెనుక...

బ్రతుకంతా పోరాటం..

సామ్రాజ్య వాదంతో.... నిరంకుశత్వంతో... ఇనుప చువ్వల చీకటిలో... కన్నీళ్ల ఒంటరితనంతో ... బతుకంతా పోరాటం.. తన వాళ్ళకు 'ఉనికి'ని తెలుపుకోలేని స్థితిలో అజ్ఞాతం... అంధకారం!!

జీవితమంతా తుపాకులూ... జైలుగోడలూ..

భరద్వాజ బారంగా నిట్టూర్పు విడిచాడు.. తనవాళ్ళంతా తను ఏనాడో చచ్చిపోయా డనుకొని వుంటారు. ఎవ్వరు పోయినా... ఎవ్వరు మిగిలినా.,. ఒక్క 'సరస్వతి' మిగిలివుంటే చాలు!

కడసారి చూపుకైనా కన్పిస్తే చాలు!! సరస్వతి భరద్వాజ భార్య.

తను సైన్యంలో వున్నప్పుడు రాసేది. భారతమృత్తికలో మొలకెత్తే ప్రతి శ్వాదలాంకురం కూడా స్మరించేలా... స్వాతంత్ర్యం కోసం సైనికుడిగా పోరాడమని!

కాని ఏం జరిగింది?

పాకిస్థాన్‌కు బందీగా అమానుషంగా పట్టుకెళ్లిన వాళ్ళల్లో తనొకడు... తన దేశం స్వాతంత్ర్యంలో ఎలా ఓలలాడుతుందో కూడా తెలీని అంధకారంలో వున్నాడు భరద్వాజ.

గతం గుర్తొచ్చి వేదాంతాన్ని వెంట తీసుకొచ్చి ఆ వృద్ధ మనిషి కళ్ళ గోడల్ని తడిపాయి నీటితెరలు.

కళ్ళద్దాలు తీసి కళ్ళు నులుముకొని... తిరిగి అద్దాలు పెట్టుకొని దారి వెతుక్కుంటూ నడుస్తున్నాడు. ఒకప్పుడు యుద్ధభూమిలో బూట్ల చప్పుడులా... చేతికర్ర చప్పుడు చేస్తోంది.

చేతిలోని సంచి బరువు అనిపిస్తోంది అలసత్వంతో. అందులో సరస్వతికి కొన్న పట్టుచీర. ఈ దేశం రావడానికి ఎంత కష్టపడ్డాడో... వచ్చాక కొద్ది డబ్బు సంపాదించుకోవడానికి నానా యాతనలు పడి ఆ డబ్బుతో సరస్వతికి చీర కొన్నాడు.

స్వాతంత్ర్యం వచ్చిన ఈ మనుషుల్ని చూసాక ఆ చీకటి గోడలే నయమనిపించిన క్షణాలు... సంఘటనలు భరద్వాజకు చాలా ఎదురయ్యాయి.

పుట్టిన వూరు కాబట్టి వచ్చాడు.

సరస్వతి బ్రతికి వుందేమోననే ఆశతో వచ్చాడు.

తనకు తెల్సు. తన తల్లి తండ్రులు ఇంతకాలం బ్రతికి వుండరు. సరస్వతితో పెళ్ళయిన వారానికే సైన్యంలో చేరాడు. ఆనాడు వెళ్లింది. ఈనాడే రావడం. పరిస్థితులు

శాపగ్రస్థుడ్ని చేసాయి.

తన వల్ల సరస్వతి ఏ సుఖం పొందలేక పోయింది. ఆ ఏడాదిలో ఒక్క నలుసు పుట్టినా బావుండేది. మరో పెళ్లి చేసుకొని పోతే అదృష్టవంతురాలు. తనకంటే ముందే చచ్చిపోయి వుంటే మరీ అదృష్టవంతురాలు.

"ఇందిరానగర్ పార్క్" పెద్ద బోర్డు కన్పించింది.

పరికించి చూసాడు. మేడలు, మిద్దెలు, గుడిసెలు కలగలిపి వున్నాయి. తన పెంకుటి ల్లెక్కడ? ఈ పార్కున్నచోట సూర్యరామం మేస్టారిగారిల్లుండేది. ఆ మేస్టారి ఇంటి వెనుక సందునించి వెళ్తే తన యిల్లు. వుందా...? కూలిపోయిందా? ఆక్రమించుకున్నారా...??

కర్ర చప్పుడుచేస్తూ సందు మలుపు తిరగ్గానే కనుచూపు మేరలో ఓ పాడుబడిన పెంకుటిల్లు కన్పించింది. అతడి బోసినోరు విచ్చుకుంది. ముక్కుపుటాలు అదిరిపడ్డాయి. కాంతిని నింపుకున్న కన్నీటిబొట్లు జలజలా రాలిపడ్డాయి.

ఇంటి తలుపులు తీసివున్నాయి!!

వృద్ధ హృదయ కవాటాలు ప్రతిధ్వనించాయి. రక్తం నరాల్లో ఉరకలు వేసింది. సరస్వతీ అని గట్టిగా అరవాలన్పించింది. ఏ ఆర్ద్రతో కంఠాన్ని పూడ్చివేసింది. గొంతు పెగల్లేదు. కళ్ళు వర్షిస్తూనే వున్నాయి.

అక్కడి పిచ్చి మొక్కల్ని పలకరించాడు. గోడల్లోంచి పొడుచుకొచ్చిన కుక్క గొడుగుల్ని ప్రేమతో నిమిరాడు. కుయ్ కుయ్ మంటూ ఏడుస్తూ వచ్చిన కుక్కపిల్లని ఎత్తుకొని ముద్దాడాడు. గడ్డిపరకల్ని స్పర్శించాడు. విపరీతమైన పులకరింత. అరుగు మెట్లని ఆప్యాయంగా తడిమాడు.

ఏ విజయమో సాధించినందుకు అలవాటుగా 'జైహింద్' అని అరవా లన్పించింది. గతం తాలూకు అనంతమైన భావ స్పందనలు చెలరేగుతుంటే వృద్ధ హృదయం ఉరకలేస్తూ తల్లడిల్లుతోంది.

కర్రను గట్టిగా చప్పుడు చేస్తూ తలుపు దగ్గరి వరకూ వెళ్లాడు. లోపల్నించి ఏ అలలికిడీ రాలేదు. సన్నని మూలుగు విన్పించింది.

చేతిసంచిని ఓ మూల పెట్టి ఆ మూలుగు విన్పించిన గదిలోకి వెళ్ళాడు. మూలగా మంచమ్మీద ఓ ముసల్ది బక్క చిక్కి కళ్ళు లోతుకు పోయి నీరసంగా మూలుగుతోంది. చింపిరిజుత్తుతో అస్థి పంజరానికి తోలు తొడిగినట్లుంది.

కొన్ని కోట్ల ఘడియలు తలపుల్లో దాచుకున్నాడేమో... అతి తొందరగా ఆమెను గుర్తించాడు.

స...ర...స్...వ...తీ..

భరద్వాజ బోసి నోరు పలుకలేకపోయింది. కర్రచప్పుడు కావటంతో ఆమె బరువుగా

కళ్ళు విప్పి చూసింది. గాజుకళ్ళు. ఎదురుగా నిలువెత్తు భరద్వాజ.

కాని ఆమె గుర్తు పట్టలేదు. పట్టే స్థితిలో కూడా లేదు. మొత్తానికి ఎవరిదో నీడ కదలాడటంతో కుడిచెయ్యి నోటిదగ్గర పెట్టి నాలుక చాచింది దాహమని! భరద్వాజ కన్నీళ్లు టపటపా జారిపడ్డాయి. వాటితో వాడిన పెదవుల్ని తడుపుకుందామె.

కళ్ళల్లో ఏదో వెలుగు జీర ప్రాకింది. మూలిగింది. చెయ్యెత్తి అటక పైకి చూపింది ప్రాధేయ పడుతున్నట్టు.. భూమిలోంచి పొడుచుకొచ్చిన ఎముకలా వుందామె చెయ్యి.

అటక మీద పెళ్ళి నాటి బొట్టు పెట్టె...

భరద్వాజ దాన్ని కష్టపడి తీసాడు.. లోపల ఏదో వుందని వెలికి తియ్యమని సైగలతో చెప్తోంది... కాదు అభ్యర్థిస్తోంది. పెళ్లినాటి తిలకం సీసా, పౌడరు డబ్బా, కాటుక, చిల్లర పైసలు, శిథిలమైన దువ్వెన... అన్నిటికన్నా క్రింద... రంగు తేలిపోయిన ఇన్‌లాండ్ లెటరు.

'చదవమంటావా' అన్నట్టు సైగ చేశాడు భరద్వాజ. ఆర్తిగా తలూపింది. పూర్తి శిధిలావస్థలో వున్న ఆ ఉత్తరాన్ని విప్పాడు.

"సరస్వతీ...

బాగున్నావా? నన్ను కన్నవాళ్ళూ... నన్ను కొన్నవాళ్ళూ... పందిట్లో పాతబడ్డ ముగ్గు... దేవుడిగుళ్ళోని హారతిపళ్ళెం... దొడ్లోని లేగదూడా... చెరువులోని కొంగా.. అంతా బాగున్నారా?

సరస్వతీ నువ్వెలాగున్నావు? నీ జ్ఞాపకాల్తో నేను క్షేమం. సరస్వతీ... ఇక్కడంతా తుపాకీల పొగవాసన... కార్పొరల్ ల బూట్ల చప్పుడు. నాగురించి కలలుగంటూ నువ్వు రగ్గు కింద పడుకొనుంటావు. నేను ట్రెంచెస్‌లో దాక్కుంటాను చలిని కప్పుకొని. ఎక్కడో అరుస్తాడొకడు. రాత్రిళ్ళకు రాత్రిల్ళు ఎడార్లూ, అరణ్యాలూ దాటాలి. మర మనుషుల్లా కదుల్తాం.

షూట్.. ట్రిగ్గర్ మీద వేలు నొక్కగానే... నీ తియ్యటి మూలుగు వినిపిస్తుంది. శోభనం గదిలో నీస్తన్యం మీద నొక్కిన అనుభూతి... గుండు దూసుకెళ్ళి ఎక్కడో శత్రువు చావుకేక...

ఎప్పుడొస్తానో నీ దగ్గరికి....

నీ జ్ఞాపకాలకంటే రెట్టింపుగా... చెమటతో తడిసిన గంజి బట్టల మీద జొబ్‌బ్ మంటున్న ఈగలు. నీ జ్ఞాపకాలే తోడు లేకుంటే ఈ నౌఖరి ఎంత బరువుగా వుండేదో? నీ పొత్తి కడుపున 'నేను' కదిల్తే నాకు వెంటనే ఉత్తరం రాయి.

ఏ అడ్రసుకు రాస్తావు?

నిన్న లిబియాలో... నేడు బెర్లిన్‌లో... రేపు స్టాలిన్‌గ్రాడ్‌లో... ఎల్లుండి మరెక్కడో? ఎక్కడికి రాస్తావు సరస్వతీ....

అత్తమామలకు అగుపించకుండా చేసే నీ కనుసైగలు గుర్తొస్తే చాలు.... నీ మెడవంపు తలిస్తే చాలు... ఎత్తయిన నీ గుండెలు ఎగిసి పడితే చాలు.... పొడవాటి జడ కదిల్తే చాలు యుద్ధభూమిలోంచి పరిగెత్తుకు రావాలన్పిస్తుంది.

వస్తాను సరస్వతీ, కొద్ది రోజుల్లోనే వస్తాను.

మొన్న ఉదయాన నీ తలపుల్లో పడి 'మార్చ్'లో తప్పటడుగు వేస్తే నాలుగ్గంటలు పరుగు శిక్షపడింది. నిన్ను తల్చుకుంటూ ఎంతసేపు పరుగెత్తానో....?

రాత్రి నీ పేరు పలవరిస్తే సెంట్రీగాడు తన్ని లేపాడు. ఆ తర్వాత బాధపడి 'భాయీ... నాకూ మిసెస్ గుర్తొస్తోంది. పిల్లలెలాగున్నారో ఏమో? అన్నాడు. మొన్న నా తోటి మిత్రుడు నా వయసువాడే యుద్ధభూమిలో చచ్చిపోతే వాడి భార్యకు 'కేబుల్ గ్రాం' పంపేముందు ఎంతగా ఏడ్చాను.

ఇక్కడ ఏడిస్తే శిక్ష.... నవ్వితే శిక్ష....

అనుభూతిని చంపుకున్నాకే తుపాకీని పట్టాలి. సీనియర్లు అనుభూతి చచ్చిన సైనికులు ఇంటికి ఇంత పెద్ద ఉత్తరం రాయరు. వాళ్ళ ఉత్తరాల్లో 'సర్వం కుశలమా? డబ్బులవసరమా?' అన్న రెండే వాక్యాలు...

అందుకే ఏ ప్రతిస్పందనా... ఏ అనుభూతి చావకముందే నేనొస్తాను సరస్వతీ....

నా కోసం అన్నీ దాచివుంచుతావు కదూ....

నీ
భరద్వాజ.

భరద్వాజ ఉత్తరం ఆపి చూసాడు. ఆమె మొహంలో ఆత్మతృప్తి స్పష్టంగా కనిపిస్తోంది. మూసుకున్న ఆమె కనుకొసల్లో రెండు నీటి బిందువులు వచ్చి ఆగాయి. తెరుచుకున్న నోరు అతడ్ని పిలుస్తున్నట్టుగా వుంది.

"సరస్వతీ... ఉత్తరం కాదు. నేనే వచ్చాను. సరిగా చూడు" భరద్వాజ తట్టి లేపుతున్నాడు.

ఆమె చూడలేదు....

లేవలేదు....

ఆమె ఎప్పుడో చనిపోయింది!!